



చుక్కల్లో రామయ్య

అయోధ్యలో సోమవారం బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రసిద్ధ చిత్రకారుడు గిన్నె సాగర్ సిరా చుక్కలతో రూపొందించిన శ్రీరాముడి చిత్రం ఇది. రోటరింగ్ పెన్‌తో లక్షలాది రంగు రంగుల సిరా చుక్కలు అద్దుతూ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. బిందు చిత్రకారుడిగా ప్రసిద్ధుడైన సాగర్.. తిరుపతిలోని టీటీడీ సంప్రదాయ శిల్ప కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

పుంగనూరులో సీను మారిందా?

- చౌడేపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్ పక్కన పసుపుజెండాల ప్రదర్శన
- భయపడటం నుంచి ఎదురొడ్డే స్థాయికి టీడీపీ శ్రేణులు



మంత్రి పెద్దిరెడ్డి వాహనం వెళ్తుండగా.. పసుపు జెండాలను రెపరెపలాడిస్తున్న టీడీపీ శ్రేణులు

మంత్రి పెద్దిరెడ్డి ఇలాకాలో సీను మారిందా? భయపడటం నుంచి ఎదురొడ్డే స్థాయికి టీడీపీ శ్రేణులు వచ్చారా? మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం చౌడేపల్లెలో వాహనంలో వెళ్తుండగా.. రోడ్డుపక్కన టీడీపీ కార్యకర్తల చేతిలో రెపరెపలాడిన పసుపు జెండాలను చూస్తే.. ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తుంది.

- పుంగనూరు

పుంగనూరు నియోజకవర్గంలో పసుపు జెండాలు కనిపించరాదని ఇటీవల సైకిల్ యాత్ర చేస్తున్న టీడీపీ కార్యకర్తల బట్టలు తీయించి కొన్ని నెలల కిందట వైసీపీ నేత దాష్టీకాన్ని ప్రదర్శించారు.

గతేడాది చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా పుంగనూరులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరిగిన గొడవ ఉద్రికత్తకు దారితీయడం, పోలీసు వాహనాల దహనం, రాళ్లు, కర్రలు, బాటిళ్లతో దాడులు.. లాఠీ చార్జీ నేపథ్యంలో దాదాపు 500 మందిపై పోలీసులు కేసులు పెట్టారు.

.. ఇలా పుంగనూరులో విపక్షాలు ఏ కార్యక్రమం చేపట్టినా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించినా పోలీసులు అడ్డుకోవడం అలవాటుగా మారింది. భారీగా కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకూ గురిచేస్తున్నారు. ఈ క్రమంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కొంతకాలంగా 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం చౌడేపల్లెలో చల్లాబాబు పర్యటన నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. చల్లా బాబు రొంపిచెర్ల నుంచి వస్తుండగా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు వెళుతున్నారని, కొంతసేపు రోడ్డుపైకి రాకుండా చౌడేపల్లె బయటే ఉండి తర్వాత మీ కార్యక్రమం చేసుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఆయన సంయమనం పాటించి గ్రామసమీపంలోనే ఉన్నారు. చల్లా బాబుకు స్వాగతం పలికేందుకు బళ్లారి డ్రమ్స్ వాయిస్తూ టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పసుపు జెండాలతో చౌడేపల్లె బస్టాండుకు చేరుకున్నారు. వీరిని దూరంగా పోవాలని పోలీసులు చెప్పినా వినలేదు. తాము ఎందుకు పోవాలంటూ ఎదురుతిరిగారు. తాము తగ్గేదేలేదని, పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయమంటూ జేజేలు కొడుతూ భారీగా చేరుకున్నారు. మంత్రి వచ్చే సమయం దగ్గర పడటంతో పోలీసులు గొడవ చేయకుండా ఉండాలని కోరారు. చల్లా బాబు, మండలాధ్యక్షులు చిట్టి అన్న జిందాబాద్ అంటూ టీడీపీ శ్రేణులు నినాదాలు చేశారు. అదే సమయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్ చౌడేపల్లె బస్టాండుకు చేరుకుంది. అయినా, టీడీపీ కార్యకర్తలు ఆగలేదు. పుంగనూరులో టీడీపీని గెలిపిస్తామని నినాదాలు చేస్తూ ఈలలు వేస్తూ, బళ్లారి డ్రమ్స్ వాయించారు. ఇలా కొన్నేళ్ల తర్వాత మొదటిసారి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా, ఆయన వెళ్లే సమయంలో రోడ్డుపై టీడీపీ కార్యకర్తలు వచ్చారు. తిరుగుబాటు మొదలైందని ఎన్నికల ముందు కార్యకర్తలు సంకేతం ఇచ్చినట్లు అయింది. రోడ్డుపై ధైర్యంగా టీడీపీ శ్రేణులు నిలబడ్డారు.



మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్ వస్తోంది.. వెళ్లిపోవాలని చెబుతున్న పోలీసులు

నేడే ఓటర్ల తుది జాబితా



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 21: ఓటర్ల తుది జాబితాను సోమవారం విడుదల కానుంది. దీనికోసం జిల్లా అధికారులు ఆదివారం నాటికి సన్నాహాలు పూర్తి చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియ ముగియడంతో ఓటర్ల జాబితా ముద్రణ సాగుతోంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి పోలింగ్‌బూత్‌కు 12 సెట్ల జాబితా పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఈసీ గుర్తించిన ఏడు రాజకీయ పార్టీలతో పాటు ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్‌వో, ఎన్నికల అధికారులకు ఒక్కో సెట్ జాబితాను అందించనున్నారు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను సోమవారం అందుబాటులో ఉంచనున్నారు. ఇదిలా ఉండగా ఓటర్ల సంఖ్య దాదాపు రెండుశాతం పెరగనున్నట్లు అంచనా. జిల్లాలో 2023 జనవరి ఒకటి నాటికి 15.43 లక్షల ఓటర్లు ఉండగా.. 2024 జనవరికి ఈ సంఖ్య రెండు శాతం అంటే స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. దీని ప్రకారం 15.55 లక్షల మందికి ఓటర్ల సంఖ్య చేరనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ తన చాంబర్‌లో మీడియా ఎదుట తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

అప్పుడు ఎకరాల్లో.. ఇప్పుడు చదరపు గజాల్లో

- జగనన్న లే అవుట్లలో స్థలాలకు మార్కెట్ ధర నిర్ణయం
- ఆదివారం నుంచే పెంచిన ధరలు అమల్లోకి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 21: జిల్లాలోని జగనన్న కాలనీ లే అవుట్లలో స్థలాలకు చదరపు గజాల చొప్పున మార్కెట్ ధర నిర్ణయిస్తూ శనివారం రాత్రి జిల్లా మార్కెట్ వ్యాల్యూ రివిజన్‌కమిటీ ఆమోదం తెలిపింది. పెరిగిన ధరలు ఆదివారం నుంచే అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఈ కాలనీల కోసం జిల్లాలో రూ.1324.55 కోట్లతో మూడు వేల ఎకరాలకుపైగా భూముల కొనుగోలు జరిగాయి. 527 లే అవుట్లలో 1.68 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ఇళ్ల పట్టాల పంపిణీ కూడా దాదాపు జరిగాయి. 2020లో ఎకరాల చొప్పున భూసేకరణ చేపట్టగా ఇప్పుడు మార్కెట్ విలువలను ఎకరా నుంచి చదరపు గజాల్లోకి మార్పులు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా లే అవుట్ల వివరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరాయి. జిల్లాలో ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఈ స్థలాలకు మార్కెట్ ధర నిర్ణయంపై సబ్ రిజిస్ట్రార్లు శనివారం కసరత్తు పూర్తి చేశారు. అదే రోజు రాత్రి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జేసీ శ్రీనివాసులు అధ్యక్షతన రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా మార్కెట్ వ్యాల్యూ రివిజన్ కమిటీ సమావేశం జరిగింది. లే అవుట్ల సమీపంలో ఉన్న గ్రామాల్లోని మార్కెట్ ధర ఆధారంగా లే అవుట్ల ధరలను మార్పులు చేశారు. ఆదివారం నుంచే పెంచిన ధరలను అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్, జిల్లా మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ అధికారిణి ఉషారాణితో పాటు ఎనిమిది మంది సబ్ రిజిస్ట్రార్లు, నలుగురు ఆర్డీవోలు హాజరయ్యారు. కొన్ని గ్రామాలు చిత్తూరు జిల్లాలో ఉన్నందున అన్నమయ్య, తిరుపతిజిల్లాల పరిధిలోని పీలేరు, చిన్నగొట్టిగల్లు పాకాల, సదుం సబ్ రిజిస్ట్రార్లు కూడా సమావేశంలో పాల్గొన్నారు.



- లే అవుట్లలో భూ విలువలు 100 నుంచి 200 రెట్లు అక్కడక్కడా పెరిగాయి. ఉదాహరణకు.. చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో చదరపు గజం ధర రూ. 330 నుంచి గాండ్లపల్లెలో రూ.7250, తిమ్మసముద్రంలో రూ. 2750, అనుప్పల్లెలో రూ. 1200, మురకంబట్టులో రూ. 3వేలకు చేరాయి. దిగువమాసాపల్లె, తాళంబేడు, బండపల్లె, బీఎన్ఆర్‌పేట తదితర ప్రాంతాల్లో చదరపు గజం రూ.200 నుంచి రూ.1000-2000 మధ్య పెరిగాయి. సోమవారం నుంచి పెరిగిన ధరల మేరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

చిత్తూరు, జనవరి 21: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ స్పందన కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతిపత్రాలను స్వీకరిస్తామని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలతో వచ్చే బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.





పసలమంద వద్దకు జనం రాకుండా అడ్డుగా ట్రాక్టర్ ట్రాలీని ఏర్పాటు చేసిన పోలీసులు - పరుగు పందేల కోసం వచ్చిన ఎద్దులను తిలకిస్తున్న జనం

పశువుల పండుగ జరపొద్దు

- పెద్దఉప్పరపల్లెలో పోలీసుల హెచ్చరిక
- రామచంద్రయాదవ్ వస్తే శాంతిభద్రతల సమస్య అంటూ అడ్డుకున్న వైనం

సోమల/పుంగనూరు, జనవరి 21: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెలో పశువుల పండుగను పోలీసులు అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జరపరాదని శనివారం నుంచే హెచ్చరికలు జారీ చేశారు. ఈ జల్లికట్టుకు బీసీవైపార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని అభ్యంతరం తెలిపారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఏటా కనుమ పండుగ తర్వాత వచ్చే ఆదివారం పెద్ద ఉప్పరపల్లెలో పశువుల పండుగను నిర్వహించడం ఆనవాయితీ. అదేరీతిన ఆదివారం పశువుల పండుగ నిర్వహణకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, సదుం, సోమల ఎస్‌ఐలు మారుతి, వెంకట నరసింహులు, తమ సిబ్బందితో శనివారం ఉదయమే గ్రామానికి చేరుకున్నారు. జల్లికట్టుకు అనుమతుల్లేవని, పసలమందలో ఏర్పాట్లు చేయరాదని ఆదేశించారు. ఇంతకాలం ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించే పశువుల పండుగను ఎందుకు ఆపుతున్నారని స్థానికులు ప్రశ్నించారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ వస్తే గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని అనుమతించడం లేదని పోలీసులు చెప్పారు. పలమనేరు డీఎస్పీ నుంచి అనుమతి తీసుకుని జల్లికట్టు నిర్వహించుకోవాలని సూచించారు. దీనిపై గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినదించారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఆ తోపులాట సమయంలో బీసీవై పార్టీ నేత గణేశ్‌యాదవ్ సెల్‌ఫోన్ కిందపడి పగిలిపోగా.. సోమల ఎస్‌ఐ తన వద్ద ఉంచుకున్నారు. సెల్‌ఫోన్ ఇవ్వాలని ఆదివారం అతడు ఎస్‌ఐను అడగ్గా.. పోలీసు స్టేషన్‌కు తరలించి బైండోవర్ కేసు పెట్టారు. ఆదివారం ఉదయం నుంచి గ్రామంలో పోలీసు గస్తీ నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బలగాలు పసలమంద వద్దకు చేరుకుని ఆ మార్గంలో ఎవరూ వెళ్లకుండా ట్రాక్టర్ ట్రాలీని అడ్డుగా నిలిపారు. పోలీసుల వైఖరిపై గ్రామస్తులు మండిపడ్డారు. రామచంద్రయాదవ్ గ్రామానికి వస్తే ఏం జరుగుతుందని నిలదీశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భయపడి గ్రామంలో జల్లికట్టు జరగకుండా పోలీసులతో అడ్డుకున్నారని ఆగ్రహించారు. ఉదయం 11గంటలకే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జనం పసలమంద పరిసరాల్లోకి చేరుకున్నారు. అనుమతి కోసం స్థానికులు గుంపులు గుంపులుగా వచ్చి పలుమార్లు పోలీసులను అడిగినా నిరాకరించారు. వచ్చిన జనం పసలమంద వద్దనే జల్లికట్టు కోసం నిరీక్షించారు. పోలీసులూ ఆదివారం రాత్రి వరకు బందోబస్తు నిర్వహించి.. జల్లికట్టును అడ్డుకున్నారు.



పెద్దఉప్పరపల్లెలో పోలీసులతో స్థానికుల వాగ్వాదం

దిగువ వీధిలో ఎద్దుల పరుగు



కాగా, పెద్దఉప్పరపల్లె దిగువవీధిలో కొందరు యువకులు ఎద్దులను వీధిలో పరుగులు పెట్టించారు. పసలమందలోని జనం అక్కడి పరుగు పందాలు తిలకించడానికి పరుగులు పెట్టారు. అక్కడికీ పోలీసులు వెళ్లి అడ్డుకోవడానికి ప్రయత్నించారు. పోలీసుల వైఖరిపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పోలీసుల జీపుపై రాయి విసరడంతో సోమల ఎస్‌ఐ జీపు వెనుక అద్దాలు పగిలాయి. ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన జనం నిరాశతో వెనుదిరిగారు.



అల్లిలో నిలబడి గిత్తలను నిలువరిస్తున్న యువకులు

మాంబేడులో జల్లికట్టు జోరు



గిత్తతో సై అంటే సై అంటూ..



గిత్తలను పట్టేశామోచ్

సంక్రాంతి ముగిసినా జల్లికట్టు జోరు తగ్గలేదు. వెదురుకుప్పం మండలం మాంబేడులో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడంతో అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ గిత్తల కొమ్ములకు రంగులు దిద్దారు. బహుమతులుగా ఉపయోగించే పట్టీలను రాజకీయ ప్రముఖులు, వివిధ దేవుళ్లు, గిత్తల యజమానుల కుటుంబీకుల ఫొటోలతో కట్టారు. కొన్నింటికి వస్త్రాలనూ కప్పి అల్లిలోకి వదిలారు. ఇలా దూసుకొస్తున్న ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ ప్రయత్నంలో కొందరు కింద పడి గాయపడ్డారు. పట్టీలను సొంతం చేసుకునే క్రమంలో గిత్తలతో కుస్తీ పడ్డారు. పట్టీలను చేజిక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టారు. మిద్దెలు, గోడలు, చెట్లను ఎక్కి జనం జల్లికట్టును వీక్షిస్తూ.. చప్పట్లు, ఈలలతో హోరెత్తించారు. జల్లికట్టుతో గ్రామం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా టీడీ పీ తరపున అన్నప్రసాద వితరణను ఆ పార్టీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ ప్రారంభించారు.

- వెదురుకుప్పం

పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ

- మంత్రి పెద్దిరెడ్డికి ఎస్పీ వత్తాసు
- మా కార్యకర్తలను పోలీసులు చెప్పులతో కొట్టారు
- గవర్నర్‌కు బీసీవై పార్టీ అధినేత ఫిర్యాదు



గవర్నర్‌కు పోలీసులపై ఫిర్యాదు చేస్తున్న రామచంద్రయాదవ్

పుంగనూరు, జనవరి 21: పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి వల్ల పోలీసులు, కొందరు అధికారులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ ఫిర్యాదు చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆదివారం గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బీసీవై పార్టీ కార్యకర్తలపై పోలీసుల దాడికి సంబంధించిన ఫొటోలు, సీఐ చెప్పుతో కొట్టిన ఫొటోను గవర్నరుకు అందజేశారు. సంప్రదాయంగా జరుపుకొనే పండుగలకుకూడా అనుమతుల పేరుతో పోలీసులు వేధిస్తున్నారన్నారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గంలోని సీఐలు, ఎస్ఐలు మంత్రికి లబ్ధి చేకూర్చేలా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. తాము నిర్వహించ తలపెట్టిన సభలను పోలీసులు అడ్డుకోవడాన్ని, అక్రమ కేసులు పెట్టారని, శ్రేణులపై చెప్పులతో కొట్టి భయపెట్టారని, దుర్భాలాడారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు యాదవ్ తెలిపారు. 'వైసీపీ అధికారంలోకి వచ్చాక కొంతమంది పోలీసు అధికారులు ప్రతిపక్షాలను వేధించడమే విధిగా పెట్టుకున్నారు. ముఖ్యంగా చిత్తూరుఎస్పీ రిషాంత్‌రెడ్డి వైసీపీ కార్యకర్తలా, మంత్రికి బంట్రోతులా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేసే ప్రతి ఒక్కరిపైనా తప్పుడు కేసులు పెడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మంత్రి అనుచరులు వ్యక్తుల పైనే కాకుండా ఆస్తులపైనా దాడులు చేస్తున్నారు' అని రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. తాను ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన గవర్నర్ సానుకూలంగా స్పందించి సాక్ష్యాధారాలను పరిశీలించి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఉలవలదిన్నెలో ఉద్రిక్తత

- బీసీవై పార్టీ శ్రేణులపై వైసీపీ కార్యకర్తల దాడి
- 20 మందికి గాయాలు



దాడిలో గాయపడిన వారు



పుంగనూరు, జనవరి 21: పుంగనూరు పట్టణ శివారులోని ఉలవలదిన్నెలో ఆదివారం రాత్రి బీసీవై పార్టీకి మద్దతు ఇస్తున్నారని 20 మందిపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై బాధితుడు, బీసీవై పార్టీ వలంటీరు కిరణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. ఉలవలదిన్నెలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగి అందరూ ఆట ముగించుకుని ఇళ్లకు చేరుకున్నారు. గ్రామంలో బీసీవైపార్టీకి మద్దతు ఇస్తున్నారని, అందులోని శ్రీనివాసులు క్రికెట్ మైదానంలో ఉన్నారని తెలుసుకుని వైసీపీకి చెందిన సర్పంచ్ సుబ్రహ్మణ్యం, లవకుమార్, సురేశ్ మరో 15మంది కలిసి దాడికి దిగారు. తీవ్రంగా కొడుతున్నారని తెలుసుకుని వారి కుటుంబీకులు, బంధువులు వెళ్లగా వారిని కూడా కర్రలు, రాళ్లతో మోటారు సైకిళ్లపై వచ్చిన వారిని వచ్చినట్లు కొట్టి రక్తగాయాలు చేశారు. ఈ దాడిలో శ్రీనివాసులు, చెంగప్ప, శివరాజు, శివ, సునీల్‌కుమార్, సుజిత్, మహేశ్, కిరణ్‌కుమార్, కొందరు మహిళలతో కలిసి 20 మంది తలలు పగలి, కాళ్లు,చేతులు, శరీరంపై గాయాలతో చికిత్స కోసం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. ఈ దాడితో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు తాము ఫిర్యాదు చేసినా తగిన న్యాయం చేయలేదని, వైసీపీ వారివైపే మాట్లాడుతున్నారని, ఆస్పత్రిలోనూ సరైన వైద్యం చేయలేదని బాధితులు వాపోయారు. ఈవిషయంపై బీసీవై పార్టీ నాయకులు మాట్లాడుతూ పుంగనూరులో వైసీపీ అరాచకాలపై తమ నాయకుడు రామచంద్రయాదవ్ రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన రోజే వైసీపీ దౌర్జన్యాలు, దాడులకు దిగిందని ఆరోపించారు.

తిరుమలలో నేడు రామాయణ పారాయణం

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాలలో సోమవారం సంపూర్ణ రామాయణ పారాయణం కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. అయోధ్యలో సోమవారం రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రామాయణ పారాయణం నిర్వహించనున్నారు. అయోధ్యలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ తమిళం, కన్నడ, హిందీ ఛానళ్లతో పాటు యూట్యూబ్ తెలుగు ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో తిరుమలలోని కళ్యాణోత్సవం అనంతరం 12 గంటల నుంచి అయోధ్య కార్యక్రమాలు ప్రత్యక్షప్రసారం కానున్నాయి.

బ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన పార్టీకే మద్దతు ఇస్తామని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు స్పష్టంచేశారు.తిరుపతిప్రెస్‌క్లబ్‌లోఆదివారం ఆయన మాట్లాడుతూ.. 2017లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో అన్ని రాజకీయపక్షాలకు చెందినవారు ఉన్నారని, అయినా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షలకు పైగా ఉన్న బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం 10 నుంచి 15 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలన్నారు. బ్రాహ్మణకార్పొరేషన్ ఏర్పాటుచేసి, వెయ్యి కోట్లు ఇస్తామన్న వైసీపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. అన్యాక్రాంతమైన బ్రాహ్మణ సమాజానికి సంబంధించిన స్థలాలను తిరిగి ఇవ్వాలని, బ్రాహ్మణ వృత్తి చేసుకుంటున్న వారికి రూ.25 వేలు ఇవ్వాలని, ఆలయ కైంకర్యాల విషయాల్లో అధికారులు, రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. టీటీడీలో పనిచేస్తున్న పోటు కార్మికులు, పరిచారికులు, వేదపండితులను పర్మినెంట్ చేయాలన్నారు.





తిరుమల నాకు ఇష్టమైన ప్రదేశం

తిరుమల తనకు ఎంతో ఇష్టమైన ప్రదేశమని సినీ హీరోయిన్ శ్రియ చెప్పారు. శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం బయట మీడియాతో మాట్లాడారు.అలాగే మిస్ ఎర్త్ ఇండియా-2019 తేజస్విని మనోజ్ఞ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





కుప్పంలో భారీ ర్యాలీ - బీసీ సదస్సులో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

అరాచక పాలనను అంతమొందించాలి

కుప్పం టీడీపీ బీసీ సదస్సు పిలుపు

కుప్పం, జనవరి 21: రాష్ట్రంలో జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు బీసీలే అంతం పలకాలని కుప్పం టీడీపీ బీసీ సదస్సు పిలుపునిచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి దాడులు, దౌర్జన్యాలే తప్ప బీసీలకు ఒరిగిందేమీ లేదని సదస్సు స్పష్టం చేసింది. కుప్పంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంనుంచి భారీ ర్యాలీ కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌కు బయలుదేరింది. ఈ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో బీసీలు తీవ్ర అణచివేతకు గురయ్యారని అన్నారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఏ ఒక్క కార్పొరేషన్‌కూ నిధులు కేటాయించని ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో బీసీలందరూ టీడీపీవైపే ఉన్నారని చెప్పారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు మాట్లాడుతూ బీసీల సంక్షేమంకోసం చంద్రబాబు గతంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలను జగన్ పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ కేవలం మాటలు తప్ప జగన్ తమకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీసీల కష్టాలు తీరేకాలం ఎంతో దూరంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపీనాథ్, చంద్రశేఖర్, ప్రతాప్, మురళి, శాంతారాం, కాణిపాకం వెంకటేశ్, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు నరేశ్, ఇతర టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరులో 'రా.. కదలిరా..'

ప్రచారంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు



కరపత్రాలతో ఇంటింటికి వెళుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 21: చిత్తూరులో టీడీపీ, జనసేన నేతలు సంయుక్తంగా 'రా.. కదలిరా..' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదివారం ఉదయం దొడ్డిపల్లెలోని సప్తకన్నికలమ్మ ఆలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు నగరంలోని 1, 2, 50 డివిజన్లలో టీడీపీ ఎన్నికల మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచి పెట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ సమన్వయకర్త దొరబాబు మాట్లాడుతూ.. వైసీపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, టీడీపీ అధికారంలోకి రాగానే ఎలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందో ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఎక్కడా లేనివిధంగా చిత్తూరు నియోజకవర్గంలో ఆరుగురు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఆశావహులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే టికెట్ ఎవరికిచ్చినా అందరూ కలసి పనిచేస్తారని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల అధికారమే లక్ష్యంగా ఇరు పార్టీల శ్రేణులు కృషిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, గురజాల జగన్‌మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్, డీకే శ్రీనివాస్, కోదండయాదవ్, పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్, గురజాల చెన్నకేశవులు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, మోహన్‌రాజ్, సీఎం విజయ, వెంకటేష్ యాదవ్, హేమాద్రి నాయుడు, కాజూరు రాజేష్, త్యాగరాజన్, సయ్యద్ ఫిరోజ్, నౌషాద్, జాఫర్, ఈశ్వర్, శంకర్, రాజశేఖర్, అశోకన్, దుర్గాచౌదరి, శశికర్ బాబు, వరలక్ష్మి, నిత్య, గోపి, శంకర్, ఉదయ్, నిత్యానందం, గోపి, ప్రభు, శ్రీదుర్గ, ప్రియాంక, జనసేన నేతలు దయారాం, ఆరణి కవిత, యశ్వంత్, ఏకే శరవణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో బోయకొండ కిటకిట





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ- క్యూలైన్ల లో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, డిసెంబరు 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ధర్మప్రచార పరిషత్ వారోత్సవాలలో భాగంగా రెడ్డెప్ప భజన బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

జిల్లా పోలీసు క్రీడలు ప్రారంభం

చిత్తూరు, జనవరి 21: చిత్తూరులోని జిల్లా పోలీసు మైదానంలో ఆదివారం పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. శాంతి కపోతాలను, బెలూన్లను ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఎగురవేసి లాంఛనంగా ప్రారంభించారు. విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీసు సిబ్బందికి క్రీడలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. క్రీడలలో పాల్గొనే ప్రతి ఒక్కరూ స్పోర్ట్స్‌ను టీమ్ వర్క్‌గా, పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు. క్రీడల్లో నైపుణ్యం ఉంటే మానసిక ఒత్తిడి నుంచి తట్టుకుంటారన్నారు. అథ్లెటిక్స్, టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్‌తో పాటు పలు అంశాల్లో క్రీడలు జరుగుతాయన్నారు. ఆదివారం వంద మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, హ్యాండ్‌బాల్, వాలీబాల్, లాంగ్‌జంప్,షార్ట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.





క్రీడల్లో పాల్గొన్న పోలీసులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

శ్రీకాళహస్తిలో టెన్షన్...టెన్షన్

టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వైసీపీ నేతలు - పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదులు...కేసుల నమోదు

శ్రీకాళహస్తి, జనవరి 21: టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ నేతలు అడ్డుకున్న ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి జరిగింది.శ్రీరామ్ నగర్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు.టీడీపీ ప్రచార రథం నుంచి సైకో పోవాలి సైకిల్ రావాలి అన్న పాటలు విన్పిస్తుండగా వైసీపీ ఏర్పేడు ఇంచార్జి కిషోర్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు మోహన్ రెడ్డి, అమ్మపాలేనికి చెందిన మురళి రెడ్డి మరికొందరితో కలిసి టీడీపీ రథాన్ని అడ్డుకున్నారు. సైకో పాటను నిలిపివేయాలనడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమీపంలోనే ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి వారి ప్రచార రథాన్ని ఘటనా స్థలానికి చేర్చి టీడీపీ ప్రచార రథానికి ముందుగా సాగారు. మళ్లీ ఇరు వర్గాల మధ్య మాట మాటా పెరిగింది.టీడీపీ నాయకుడు కన్నలి ప్రతాప్ రెడ్డి సర్దిచెప్పారు.తర్వాత టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిలో ఒక్కరైన మురళి రెడ్డి ఊరందూరుకు చేరుకొని బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పినట్లు సమాచారం.కాగా ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటన ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో వైసీపీలో అంతర్మధనం జరిగినట్లు సమాచారం.ఆదివారం మధ్యాహ్నం మురళి రెడ్డి తమపై దాడి జరిగిందంటూ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. టీడీపీ నాయకులు తనను కిడ్నాప్ చేసి శనివారం అర్ధరాత్రి ఊరందూరుకు తీసుకువెళ్లి గన్ తలపై పెట్టి చంపేస్తామని బెదిరించినట్లు ఆరోపిస్తూ శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.చివరకు టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వైసీపీ నాయకుడు మురళి ఫిర్యాదు మేరకు కిడ్నాప్,దాడి కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ ప్రచార రథం డ్రైవర్ మోహన్ తనపై వైసీపీ నాయకులు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి అడ్డుకొని దాడి చేయడంతో పాటు తనని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ ముగ్గురి మీదా అట్రాసిటీ, దాడి కేసులు నమోదు చేశారు.



వైసీపీ నేతలపై సీఐ అంజూయాదవ్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

మహిళల స్వేచ్ఛకు భరోసా ఏదీ: టీడీపీ

శ్రీకాళహస్తిలో మహిళల స్వేచ్ఛకు భరోసా లేదని సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకోవడంపై ఆమె తన ఆవేదనను వీడియోలో పొందుపరిచి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంలోకి తెచ్చారు.శ్రీరామ్ నగర్ కాలనీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకుంటుంటే వైసీపీ కార్యాలయ సమీపంలో మద్యం సేవించిన ఆ పార్టీ నేతలు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి రెడ్డి దుర్భాషలాడుతూ అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బొజ్జల సుధీర్‌రెడ్డి ఏర్పేడు మండలం ఎండీపుత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో స్పందించారు.తానెప్పుడూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల జోలికి కానీ ఆయన సోదరుడు కిషోర్‌రెడ్డి జోలికి కానీ పోలేదన్నారు. అయితే వైసీపీ నేతలు తన కుటుంబంపై దాడి చేయడానికి ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. తన కుటుంబం జోలికి వస్తే తాట తీస్తానని హెచ్చరించారు.

వైసీపీని సాగనంపితేనే అభివృద్ధి: అమర్



పలమనేరు, జనవరి 21: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆదాయం పెరగలేదని, ఉద్యోగాలు రాలేదన్నారు. మద్యం నిషేధం చేశాకే ఓటు అడుగుతానన్న జగన్ ఆ మాటపై కట్టుబడాలన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయింది బడుగు, బలహీన వర్గాలేనని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రజలకు సామాజిక న్యాయం చేశానని చెబుతున్న జగన్.. జీవో నెంబరు 3ను ఎందుకు రద్దుచేశారో చెప్పాలన్నారు. భూరక్షణ చట్టం అమల్లోకి వస్తే ప్రజల భూములు గోవిందా అని, టీడీపీ వచ్చాక భూరక్షణ చట్టం రద్దుచేస్తామని చెప్పారు. పేదలను సంపన్నులను చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకొంటుందని, తాము అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు



సంజయ్ (ఫైల్‌ఫొటో)

కుప్పం, జనవరి 21: కుప్పం మండలం పెద్దబంగారునత్తం చెరువులో మునిగి ఒక యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు... కుప్పం పురపాలక సంఘం సామగుట్టపల్లెకు చెందిన సంజయ్ (25) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం పెద్దబంగారునత్తం చెరువులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతుండగా సంజయ్ చెరువులో మునిగి గల్లంతయ్యాడు. మిగిలిన ముగ్గురు స్నేహితులు బయటకు వచ్చి సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అతడితో కలిసి ఈతకు వెళ్లిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

పుదుచ్చేరి బీచ్‌లో పెనుమూరు యువకుడి మృతి



జీవన్ చౌదరి (ఫైల్ ఫొటో)

పెనుమూరు, జనవరి 21: కుటుంబ సభ్యులతో విహార యాత్రకు వెళ్లిన పెనుమూరు యువకుడు పుదుచ్చేరి బీచ్‌లో గల్లంతై.. శవమై తేలాడు. పెనుమూరు మండలం మనియానంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడు, భవానీ పెద్ద కుమారుడు జీవన్ చౌదరి(31), కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు పుదుచ్చేరి వెళ్లారు. అక్కడ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బీచ్‌లో సరదాగా ఆడుకుంటుండగా భారీ అలలు రావడంతో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడ ఉన్న స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. గంట తర్వాత జీవన్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన డీఏ శ్రీనివాస్



పుంగనూరు, జనవరి 21: పుంగనూరు బైపాస్‌రోడ్డులో ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు కుమారుడు డీఏ శ్రీనివాస్ కలిశారు. మదనపల్లె-చిత్తూరు బైపాస్‌రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద ఇద్దరూ కొంతసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు.

బ్రాహ్మణ సంక్షేమ సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



పుంగనూరు రూరల్, జనవరి21: గాయిత్రి మాతా తాలూకా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ నూతన అధ్యక్షుడిగా సురేంద్రరావ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పుంగనూరు హైస్కూల్‌వీధిలో జరిగిన బ్రాహ్మణ సంఘ సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రామమూర్తి, కోశాధికారిగా ఫణిభాస్కర్, గౌరవ అధ్యక్షుడుగా కామకృష్ణ, ఉపాధ్యక్షులుగా వెంకటప్రసాద్, రమణారావ్, సర్వతమ్మ, సహాయ కార్యదర్శిగా సాయిపవన్, న్యాయ సలహాదారులుగా పీఎస్ఎస్ ప్రకాశ్, గౌరవ ఆర్థిక సలహాదారులుగా ఉదయ్‌కుమార్‌తోపాటు 13మందిని కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు.

24, 25 తేదీల్లో ఇస్తిమా



ఇస్తిమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి21: ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించే ఇస్తిమా ఏర్పాట్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముస్లిం నాయకులతో కలసి పరిశీలించారు. ఆదివారం భీమగానిపల్లె సమీపంలో రెండు రోజుల పాటు ఇస్తిమా నిర్వహించనున్నారు. ఇస్తిమాకు అవసరమైన తాగునీరు, విద్యుత్, బందోబస్తు కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, రాయలసీమ జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జి షరీఫ్, మైనార్టీ నాయకులు అమ్ము, కిజర్, జావిద్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

శాంతిపురం, జనవరి21: తుమ్మిశిలోని సోమేశ్వరస్వామి ఆలయ వార్షిక బహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి 31 వరకు జరగనున్నట్లు ప్రధాన అర్చకులు అప్పన్నస్వామి, తుమ్మిశి గ్రామస్థులు తెలిపారు. 29న గణపతిపూజ, శతరుద్రాభిషేకం, రాత్రి సంకటహర చతుర్థి పూజ, చండీమూలమంత్ర హోమం, చండీ సప్తశతి పారాయణం జరుగుతుందని వారు తెలిపారు. 30న స్వామి అమ్మవార్ల అభిషేక, రుద్రహోమం, చండీహోమం, పూరాహుతి, భగవద్గీత పారాయణం, వేదపారాయణం, ఊంజల్‌సేవ, ఉత్సవఊరేగింపు జరుగుతుందని తెలిపారు. 31న గిరిజా కల్యాణం, రాత్రి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

కంటి ఆపరేషన్లకు 39 మంది ఎంపిక



కుప్పం, జనవరి 21: సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో, బెంగళూరు కంటి ఆసుపత్రి సౌజన్యంతో కుప్పంలో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మంది రోగులకు కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 39 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపిక చేసినవారికి బెంగళూరు కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించి, కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇస్తామని సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్.శివప్రకాశ్, వినోద, లావణ్య తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న అంగన్వాడీల నిరసన దీక్ష



బైరెడ్డిపల్లెలో నిరసన దీక్షలో వున్న అంగన్వాడీలు

బైరెడ్డిపల్లె, జనవరి 21: బైరెడ్డిపల్లెలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె ఆదివారం 40వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకు ఆందోళన విరమించే ప్రసక్తేలేదని అంగన్వాడీలు తమ నిరసనదీక్ష కొనసాగించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

అక్రమ మద్యం కేసులో ఒకరి అరెస్టు



పలమనేరు, జనవరి21 : కర్ణాటక నుంచి అక్రమంగా స్కూటీలో 192 టెట్రా ప్యాకెట్లు తీసుకు వస్తున్న ఎం. అసిరినాయుడు అలియాస్ గణేష్ అనే వ్యక్తిని ఆదివారం ఉదయం అరెస్టు చేసినట్టు పలమనేరు పోలీసులు తెలిపారు. పలమనేరు దండపల్లి రోడ్డు పక్కన నివాసముంటున్న అసిరినాయుడు రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం కుక్కల దొడ్డి సమీపంలో ఒక వ్యక్తినుంచి కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు కొనుగోలు చేసి తీసుకు వస్తుండగా నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద అరెస్టుచేసి మద్యం ప్యాకెట్లు, స్కూటీని స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరచినట్టు పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు



పెద్దపంజాణి, జనవరి 21: పెద్ద పంజాణి మండలంలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. వీటిద్వారా గ్రామాలలో చెత్తను సేకరించి దాని ద్వారా రైతులకు ఉపయోగపడే వర్మీకంపోస్టు తయారుచేసి రైతులకు అందించే లక్ష్యంగా వీటిని నిర్మించారు. మండలంలోని 25 పంచాయతీలకు అవసరమైన కేంద్రాలను నిర్మించారు. అయితే 2019 ప్రభుత్వం మారడంతో ఈ కేంద్రాల నిర్వహణను గాలికొదిలేశారు. కేవలం వీటికి రంగులు వేయడంపై ఉన్నశ్రద్ధ వీటిని ఉపయోగంలోకి తేవడంపై లేకపోవడం బాధాకరం. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి సందర్శించి ఉపయోగంలోకి తేవాలని మండల స్థాయి అధికారులకు ఆదేశించినా కనీస స్పందన కూడా లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు

చిత్తూరు సిటీ, జనవరి 21: ఓంశక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లి రావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 ఉచిత బస్సులను ఏర్పాటుచేశారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరు, పచ్చనపల్లి, గువ్వకల్లు, నగరంలోని పెద్దహరిజనవాడ, తోటపాళ్యం, లక్ష్మీనగర్ కాలనీ, గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లి, కిలారిపల్లిలో ఓంశక్తి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. ఓంశక్తి భక్తులకు అన్నదానం, ఉచితంగా చీరలు పంపిణీ చేసి, మేల్‌మరువత్తూర్ యాత్రకు బస్సులను ప్రారంభించారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

24న శాంతిపురంలో జయహో బీసీ సభ

శాంతిపురం : ఈనెల 24న శాంతిపురంలో జయహో బీసీ సభ నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు శరవణకుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రాజెక్టుల పేరుతో పీఎల్ఆర్ కంపెనీ దోచుకుంటోంది

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, జనవరి21: ప్రాజెక్టుల పేరుతో పీఎల్ఆర్ కంపెనీ దోచుకుంటోందని, ప్రాజెక్టుల నిర్మాణంతో నష్టపోయే రైతులకు మాత్రం ఒక్కరూపాయి నష్ట పరిహారం ఇవ్వలేదని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రెండవ రోజు చౌడేపల్లె, గోసలకుర ప్పల్లె, నాయుని వారిపాళ్యం, మెదరదొడ్డి, బీసీకాలనీ, టీచర్స్ కాలనీలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం అని, ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న పేదలకు ఇళ్లు ఎక్కడ అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు సీఎం కావడం ఖాయమని, అభివృద్ధి, సంక్షేమం ఆయనతోనే సాధ్యమన్నారు. పుంగనూరులో టీడీపీని గెలిపించి అధినేత చంద్రబాబుకు కానుకగా ఇద్దాం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ములంగి రమణ, మైనార్టీ మండలాధ్యక్షులు మహ్మద్‌ఘని, నాయకులు లక్ష్మీపతిరాజు, గిరిరాజు, బోయకొండ సుబ్బు, హరిప్రసాద్, ప్రభాకర్,హమీద్‌ఖాన్, వెంగళపల్లె రమణ, భూషణ, వెంకటరమణ, కల్యాణ్, ఓబుల్‌రెడ్డి, నాగరాజరెడ్డి, బాబు నాయుడు, విజయ భాస్కర్ రెడ్డి, మునిరాజరెడ్డి, కార్తీక్, మునెంకటప్ప, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లె గ్రామ వీధుల్లో పసుపు జెండాలతో టీడీపీ కార్యకర్తలు

గుత్తార్లపల్లెలో బోరు డ్రిల్లింగ్ అడ్డగింత

గ్రామస్తులను దౌర్జన్యంగా నెట్టేసి బోరు డ్రిల్లింగ్ ప్రారంభించిన వైసీపీ నాయకులు



గుత్తార్లపల్లె వద్ద బోరు వేయడాన్ని అడ్డగిస్తున్న గ్రామస్తులు

గుడుపల్లె, జనవరి21: గ్రామానికి నీరందించే బోరు పక్కన మరో బోరు వేయడాన్ని గ్రామస్తులు అడ్డగించి నిరసన తెలిపిన ఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... గుత్తార్లపల్లెకు నీటిని సరఫరా చేసేందుకు కుప్పం-గుడుపల్లె ప్రధాన రహదారి పక్కన కొన్ని సంవత్సరాల క్రితం బోరు ఏర్పాటు చేసారు. ఇదే రహదారి పక్కన కొంతదూరంలో వన్నెకుల క్షత్రియ సామాజిక భవనాన్ని కొత్తగా నిర్మించారు. ఈ భవనానికి తాగునీటిని సరఫరా చేసేందుకు వైసీపీ నాయకులు గుత్తార్లపల్లె ప్రభుత్వ తాగునీటి బోరు పక్కన కొత్తగా బోరు వేయడానికి పూనుకున్నారు. విషయం తెలుసుకొన్న గ్రామస్తులు బోరు వేస్తున్న వాహనం వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. ఆ తరువాత గ్రామస్తులు బోరు వాహనం ఎదుట తమ నిరసన తెలిపారు. కొత్త బోరు వేస్తే తమ గ్రామానికి సరఫరా అయ్యే బోరు బావిలో నీరు అడుగింటి పోతుందని, కొత్త బోరు వేయడాన్ని విరమించాలని గ్రామస్తులు వైసీపీ నాయకులను కోరగా వారు ససేమిరా అన్నారు. కొంత సమయం బోరు వేయడాన్ని ఆపారు. ఆ తరువాత వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకుని గ్రామస్తులను అక్కడ నుంచి దౌర్జన్యంగా నెట్టివేసి బోరు వేయడాన్ని ప్రారంభించారు.

కూటాలవంకలో కోలాహలంగా మైలేరు

బైరెడ్డిపల్లె, జనవరి 21 : మండలంలోని కూటాలవంక గ్రామంలో ఆదివారం మైలేరు పండుగను కోలాహలంగా నిర్వహించారు. బాగా పరుగెత్తిన పశువులకు నిర్వాహకులు భారీగా బహుమతులు ప్రకటించడంతో వివిధ ప్రాంతాల నుంచి పశువులను మైలేరు పండుగకు తీసుకొచ్చి పరుగుపందెంలో వదిలిపెట్టారు. వేగంగా పరిగెడుతున్న కోడెగిత్తలను నిలువరించడానికి యువకులు ఉత్సాహంతో పోటీపడ్డారు. పండుగను తిలకించడానికి అధికసంఖ్యలో జనం తరలిరావడంతో కూటాలవంక కిక్కిరిసిపోయింది.



ప్రాభవం కోల్పోయిన టూరిజం హోటల్





పలమనేరు సమీపంలోని పర్యాటక శాఖ హోటల్ ప్రధాన భవనం, హోటల్‌లో తొలగించిన కిటికీలు, పెచ్చులూడుతున్న పైకప్పు

పలమనేరు, జనవరి21: పలమనేరులో జాతీయ రహదారి పక్కనే పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన టూరిజం హోటల్ ప్రాభవం కోల్పోయింది. చెన్నై-బెంగళూరు జాతీయరహదారి కిరువైపులా పలమనేరు విస్తరించి వుంది. ప్రతినిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గుండానే వెళ్తుంటాయి. వీరికోసం ఒక హోటల్ నిర్మిస్తే బాగుంటుందని భావించి 1999లో అప్పటి పలమనేరు ఎమ్మెల్యే పట్నం సుబ్బయ్య పౌరసరఫరా శాఖా మంత్రిగా ఉండగా పర్యాటక శాఖచే ఎకరా స్థలంలో టూరిజం హోటల్ నిర్మించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 1999 జూలై 9న ఈ హోటల్‌ను ప్రారంభించారు. కొన్నేళ్ల పర్యాటక శాఖ ఈ హోటల్‌ను నిర్వహించి అటుపిమ్మట లీజుకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. విశాలమైన ఒక హోటల్ భవనం, ఆ భవనంలోనే రెండు దుకాణాల గదులు, వాహనాల పార్కింగ్ కోసం సువిశాల స్థలం కేటాయించి, మరుగుదొడ్లను నిర్మించారు. అంతేకాక సుదూర ప్రాంతాలనుంచి వచ్చే వారు సేద తీరేందుకు అధునాతన వసతులతో నాలుగు గదులను కూడా నిర్మించారు. అయితే లీజుకు తీసుకొన్న వారు కరోనా ముందు వరకు కూడా హోటల్‌ను నడుపుతుండే వారు. అటుపిమ్మట పలమనేరు వద్ద బైపాస్ రోడ్డు నిర్మించడంతో ఇక్కడి జాతీయరహదారిపై వాహనాల రద్దీ తగ్గిపోయింది. దీంతో లీజు తీసుకొన్నవారు తమ లీజు రద్దుచేసుకొని వెళ్లిపోయారు. ఈ హోటల్ నిర్మించి రెండు దశాబ్దాలు గడిచిపోయినా ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో హోటల్ భవనం పైకప్పు పెచ్చులూడటం ప్రారంభమైంది. ఈనేపథ్యంలోనే ఈ హోటల్‌ను పర్యాటక శాఖ ప్రైవేటు వ్యక్తులకు బార్ నడుపుకొనేందుకు లీజుకు ఇచ్చారు. వారు కూడా కొద్దినెలలు నడిపి వారు కూడా వదిలి వెళ్లిపోయారు. అప్పటికే కరోనా రావడంతో రెండేళ్లపాటు వృధాగా పడిఉన్న ఈ హోటల్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మద్యం దుకాణం నడుపుతున్నారు. ప్రస్తుతం ఈ హోటల్ ఆవరణలో ఎక్కడ చూసినా తాగి ఖాళీ అయిన మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. ప్రధాన గేటు తుప్పుపట్టి పాక్షికంగా, ఒక గేటు పూర్తిగా విరిగి పోయింది. అంతేకాక జాతీయరహదారి నుంచి హోటల్ వరకు ఉన్న బీటీ రోడ్డు సైతం గుంతలు పడి కంకర తేలింది. ప్రభుత్వం ఈ స్థలాన్ని జైళ్ల శాఖకు కేటాయిస్తే పలమనేరులో సబ్‌జైల్ నిర్మాణానికి పూనుకునే అవకాశం వుంది.





శిలాఫలకం ముందరే మందు సీసాలు, హోటల్ ఆవరణలో వృథాగా ఉన్న గదులు

'కోడికత్తి కేసులో అసలు ముద్దాయి జగనే'

పెనుమూరు, జనవరి 21: కోడికత్తి కేసులో అసలు ముద్దాయి ముఖ్యమంత్రి జగనే అని చిత్తూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ ఆరోపించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వైజాగ్ విమానాశ్రయంలో తన అభిమాని దళిత బిడ్డ శ్రీను దగ్గర సింపతి కోసం జగనే కోడికత్తితో దాడి చేయించుకుని డ్రామాలు ఆడారని ఆరోపించారు. కోర్టుకెళ్లి సాక్ష్యం చెప్పకుండా ఎందుకు జగన్ తప్పించుకుంటున్నారని, కోర్టుకు వెళితే ముద్దాయి తానేనని బయటపడుతుందని భయపడుతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. దళితులను జైల్లో పెట్టి హింసిస్తూ బయట దళిత ఓట్ల కోసం అంబేడ్కర్ విగ్రహం పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు రాధమ్మ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటనే శ్రీను విషయంలో స్పందించి వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దళిత మహిళలు రోడ్లపై నిరసనకు దిగుతామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జనవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కొట్రకోనకు చెందిన సుమన ఆదివారం రూ.1,00,000 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శిగా శంకర్

చిత్తూరు సిటీ, జనవరి 21: చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శిగా నగరానికి చెందిన గుండ్లూరు శంకర్ నియమితులయ్యారు. ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, బీసీ విభాగం అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి ఈ మేరకు అదనపు నియామక పత్రాన్ని విడుదల చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గంగాధరనెల్లూరు, జనవరి 21: తూగుండ్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం 38 ఏళ్ళ తర్వాత పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం ఉన్నత పాఠశాలలో 19985-86లో 10వతరగతి పూర్తిచేసిన విద్యార్థుల అపూర్వకలయిక అప్పటి విద్యార్థులైన రాజేంద్ర నాయుడు, నటరాజ్ మొదలి, ఏకాంబరరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, షబ్బీర్‌అలీ, శ్రీనివాసులు మొదలి, సత్యమూర్తి, బాలకృష్ణారెడ్డి, జగదీష్ నాయుడుల సహకారంతో జరిగింది. ఈ సమావేశానికి అప్పటి గురువులైన దొరై రాజ్, కృష్ణన్, ప్రభాకర్, దేవరాజులు నాయుడు, రామా నాయుడు, మాధవన్, మోహన్‌పిళ్లై, మనోహర్‌లకు పూర్వవిద్యార్థులు పాదపూజలు చేసి, ఘనంగా సన్మానించారు. పలువురు రిటైర్డ్ టీచర్లు మాట్లాడుతూ 38ఏళ్ళ తర్వాత తమ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దేవరాజులు మందడి, గుణశేఖర్ నాయుడు, హేమ, రిటైర్డ్ టీచర్లు కమ్మరల్లీ, ఆర్ముగంపిళ్లై పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్ర

పూతలపట్టు, జనవరి 21: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పూతలపట్టు మండలానికి చెందిన చంద్రను ఆ సంఘం నాయకులు ఆదివారం తిరుపతిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూతలపట్టు మండలం వెంగంపేట క్రాస్ రోడ్డు గ్రామానికి చెందిన చంద్ర పూతలపట్టు ఎంపీపీ కుమారి భర్త చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంపై పలువురు బీసీ నాయకులు అభినందనలు తెలిపారు. అలాగే మండల అధ్యక్షుడుగా కొత్తకోటకు చెందిన రమేష్, ఉపాధ్యక్షుడుగా పెరుమాళ్‌ను ఎన్నుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు రూరల్, జనవరి21: కర్ణాటక మద్యం తరలిస్తుండగా వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్స్ కేశవరాజు, మహేంద్ర తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్ పేటలోని ప్రకాశం కాలనీకి చెందిన మోహన్ కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడడంతో అతని వద్ద ఉన్న 192 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు తెలిపారు. అలాగే ఎన్ఎస్‌పేట ప్రకాశం కాలనీకి చెందిన బోయకొండ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర అతడిని అదుపులోకి తీసుకుని 192ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విజయవాడ వెళ్లకుండా కట్టడి

పలమనేరు, జనవరి21 : అంగన్వాడీల ఆందోళన ఉధతం చేసే నేపథ్యంలో విజయవాడకు బయలు దేరుతున్న పలమనేరు సీఐటీయూ నాయకుడు గిరిధరగుప్తాకు ఆదివారం మహిళా పోలీసులు నోటీసులు అందజేశారు. విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేసేందుకు ఎటువంటి అనుమతులు లేవని, గుంపులు కూడటం నిషేధమని పేర్కొంటూ గిరిధరగుప్తాకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గిరిధర గుప్తా మాట్లాడుతూ అంగన్వాడీల ఆందోళన న్యాయసమ్మతమైందని, ప్రభుత్వం వీరి ఆందోళనలను కట్టడి చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా వారు మాత్రం తమ ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తారని పేర్కొన్నారు.

నేడు రామ భజనలు

శాంతిపురం, జనవరి21:రాళ్ళబూదుగూరులో వెలిసిన కోదండరామస్వామి ఆలయంలో సోమవారం శ్రీరాముడి భజనలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయోధ్యలో శ్రీరాముడి ఆలయం ప్రారంభంతోపాటు బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుండడంతో కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాలు పూజలు రాముడి పట్టాభిషేకం, భజనలు, స్వామి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేడు రామకోటి భజనలు

కల్లూరు, జనవరి 21: పులిచెర్ల మండలం దిగువపోకల వారిపల్లిలోని శ్రీరామ మందిరం ప్రాంగణంలో సోమవారం రామకోటి భజనలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పోకల ఉమాదేవి తెలిపారు. అయోధ్యలో శీరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా రామకోటి భజనలు కొనసాగుతాయన్నారు. భక్తులు రామకోటి భజనల్లో పాల్గొనాలని కోరారు.

వేమన పద్యాలపై ప్రచారం

పలమనేరు, జనవరి21 : మండలంలోని గడ్డూరులో ఆదివారం ఇందు జ్ఞానబోధ సమితి సభ్యులు వేమన పద్యాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి పుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వర్లు రచించిన నిగూఢ తత్వార్థ బోధిని అనే గ్రంథంలో 110 వేమన పద్యాలకు ఆధ్యాత్మిక వివరణ రాసారన్నారు.త్రైతసిద్ధాంత- ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షుడు బాలాజి, సమితి సభ్యులు రాజేంద్ర, వాణిశ్రీ, హేమంత్, రెడ్డెమ్మ, రేణుకాదేవి, రేఖ, కళ్యాణి పాల్గొన్నారు.

ఉచిత ఆర్థోపెడిక్స్ వైద్య శిబిరం



కుప్పం, జనవరి 21: కుప్పంలోని బీఆర్డీ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ సురేశ్‌బాబు సహకారంతో మణిపాల్ హాస్పిటల్ డాక్టర్ రాజేశ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్స్ వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 140 రోగులకు వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మ ఊరేగింపు

సదుం, జనవరి 21: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో ఉన్న సదుం ఎల్లమ్మ విగ్రహ ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలేరు, పుంగనూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కుప్పం రూరల్, జనవరి 21: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లెకు చెందిన వెంకటేశ్ కుమారుడు వాసు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, తెలుగు యువత నాయకుడు మణి తదితరులు ఆదివారం మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తరఫున మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 21: బగలనత్తం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శంకరప్పనాయుడు తల్లి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, గోవిందప్ప, మంజునాథరెడ్డి, రాఘవేంద్రరాయుడు తదితరులు మృతురాలి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

నేడు రామకుప్పంలో శోభాయాత్ర

రామకుప్పం, జనవరి 21: అయోధ్యలో రామమందిరం కుంభాభిషేకం, బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను పురస్కరించుకుని సోమవారం రామకుప్పం పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని బజారువీధితోపాటు అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ళపై శ్రీరామ పతాకాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటలకు పట్టణంలో శోభాయాత్ర ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో శ్రీరామ భజనలు జరుగుతాయన్నారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. ప్రతి ఇంటా 5దీపాలు వెలిగించి పూజలు చేయాలని, అయోధ్య అక్షింతలను తలలపై వేసుకోవాలన్నారు.

సోమలలో కాషాయ జెండాలు

సోమల, జనవరి 21: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమల పురవీధుల్లో కాషాయ జెండాలు రెపరెపలాడాయి. సోమవారం స్థానిక యోగాబి రామాలయంలో ఉదయం నుంచి భక్తులచే అభిషేకపూజలు, రామకోటి జపయజ్ఞం, అన్నదానం, సాయంత్రం సీతారామ సమేత హనుమంతు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ కార్యకర్త కుటుంబానికి జీజేఎం ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 21 : టీడీపీ కార్యకర్త కుటుంబానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం నగరంలోని 10వ వార్డు వివేకానంద కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. కాగా గురజాల జగన్మోహన్ ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి పార్టీ తరపున రూ.50 వేలు వారి కుటుంబసభ్యులకు అందించారు. అలాగే పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని, ప్రభుత్వం తరపున సాయం అందేలా కృషిచేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమలో పార్టీ నేతలు శేషాద్రి నాయుడు, ఆనంద్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ దొరబాబుకు పలువురి శుభాకాంక్షలు



చిత్తూరు సిటీ, జనవరి 21: టీడీపీ మాజీ ఎమ్మెల్సీ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త దొరబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, పార్టీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో 72 కేజీల కేక్‌ను కట్ చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు దొరబాబుకు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుయువత ఆధ్వర్యంలో స్థానిక మురకంబట్టులోని డీకే ఆదికేశవులు విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, డీకే శ్రీనివాస్, డీకే బద్రీనారాయణ, సురేంద్రకుమార్, గురజాల చెన్నకేశవులు నాయుడు, కోదండ యాదవ్, త్యాగరాజన్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, హేమాద్రి నాయుడు, శంకర్, సయ్యద్ ఫిరోజ్, నౌషాద్, దుర్గాచౌదరి, రాజశేఖర్, అశోకన్, వరలక్ష్మి, శేషాద్రి, ఈశ్వర్, జనసేన నేతలు దయారాం, ఆరణి కవిత, యశ్వత్, శరవణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శిగా శంకర్



చిత్తూరు సిటీ, జనవరి 21: చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శిగా నగరానికి చెందిన గుండ్లూరు శంకర్ నియమితులయ్యారు. ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, బీసీ విభాగం అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి ఈ మేరకు అదనపు నియామక పత్రాన్ని విడుదల చేశారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్ర



పూతలపట్టు, జనవరి 21: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పూతలపట్టు మండలానికి చెందిన చంద్రను ఆ సంఘం నాయకులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంగళరావు యాదవ్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నా రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూతలపట్టు మండలం వెంగంపేట క్రాస్ రోడ్డు గ్రామానికి చెందిన చంద్ర పూతలపట్టు ఎంపీపీ కుమారి భర్త. చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంపై పలువురు బీసీ నాయకులు అభినందనలు తెలిపారు. అలాగే మండల అధ్యక్షుడుగా కొత్తకోటకు చెందిన రమేష్, ఉపాధ్యక్షుడుగా పెరుమాళ్‌ను ఎన్నుకున్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి


చిట్టిబాబును సన్మానిస్తున్న కిషన్‌చంద్

వెదురుకుప్పం, జనవరి 21: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు అన్నారు. ఆదివారం వెదురుకుప్పం మండలం తెట్టుగుంటుపల్లెలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పాలన రావడం తథ్యమన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తారన్నారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తర్వాత ఆయన్ను టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు కిషన్ చంద్ శాలువ కప్పి సత్కరించారు. టీడీపీ నాయకులు చక్రి, బాష్యం సతీశ్ నాయుడు, వి.నాగరాజురెడ్డి, నాగార్జున్, శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


మునికృష్ణమ నాయుడుకు బీజేపీ కండువా కప్పుతున్న నారాయణస్వామి నాయుడు

నగరి, జనవరి 21: నగరికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. పట్టణ పరిధిలోని ఎస్‌వీసీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సాయి సెక్యూరిటీ సర్వీస్ ఏజెన్సీ నిర్వాహకులు మునికృష్ణమ నాయుడు, మరి కొంతమంది బీజేపీ సీనియర్ నేత నారాయణస్వామి నాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర ప్రసాద రెడ్డిల సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామమూర్తియాదవ్, మహిళా మోర్చా జాతీయ నాయకురాలు నిషిధరాజు, నాయకులు రమేష్ నాయుడు, మోహన్, బాబు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం

కార్వేటినగరం, జనవరి 21: కార్వేటినగరం మండలం ఆలత్తూరు లోని టీటీడీ వరద వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ పరిసరాలలో చెత్తాచెదారాన్ని, కలుపు మొక్కలను తొలగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, జనవరి 21: అంబేడ్కర్ సర్కిల్ వద్ద గల అన్నాక్యాంటీన్‌లో టీడీపీ నేతలు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు హేమాద్రి నాయుడు, నాయకులు ఊట్ల నాగరాజ నాయుడు, ఏకాంబరం, బాలాజి, రామానుజంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సీతారాముల ఊరేగింపు

బంగారుపాళ్యం, జనవరి 21: అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా సీతారాముల విగ్రహాలను బంగారుపాళ్యం పురవీధుల్లో ఊరేగించనున్నట్లు గ్రామపెద్దలు, మార్వాడి సేఠ్ యూనియన్ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చంద్రబాబు పాలనకోసం ప్రజల ఎదురుచూపు

గంగాధరనెల్లూరు, జనవరి 21: రాష్ట్రంలో జగన్ పాలనతో విసుగు చెందిన ప్రజలు రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి పదవిలో కూర్చొని పాలన సాగించాలని ఎదురుచూస్తున్నారని జిల్లా టీడీపీ తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పిలుస్తోంది రా...కదిలి రా బహిరంగసభకు లక్షలాది మంది జనం తరలివస్తున్నారని అన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కొత్రకోనకు చెందిన సుమన ఆదివారం రూ.1,00,000 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమిపూజ


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

విజయపురం, జనవరి 21: మండలంలోని మల్లారెడ్డి కండ్రిగ ఆది ఆంధ్రవాడలో మల్లారెడ్డి కండ్రిగ నుంచి ఆది ఆంధ్రవాడ వరకు రూ.4 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న సిమెంటు రోడ్డుకు మంత్రి ఆర్కే రోజా ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు గోపీనాథ్, సర్పంచ్‌లు శాంతి, కుప్పారెడ్డి, భాస్కర్‌రాజు, కుమార్, నాయకులు శరత్ రెడ్డి, ప్రసన్నకుమార్, శేఖర్‌రాజు, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈచనేరిలో పశువుల పండగ


పశువులకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

తవణంపల్లె, జనవరి 21: మండలంలోని ఈచనేరిలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఎద్దులకు పూజలు నిర్వహించి వీధుల్లో ఊరేగించి పరిగెత్తించారు. వేగంగా పరిగెత్తిన ఎద్దుకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలతో పాటు మరో 7 ఎద్దులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

- డీసీసీ అధ్యక్షుడు భాస్కర్


కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు, నాయకులు

వెదురుకుప్పం, జనవరి 21: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సుస్థిర పాలన సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ వెదురుకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు కందుకూరు హుమేష్, నాయకుడు జయచంద్ర ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు, జనవరి 21: ప్రజలు, వాహనదారుల కోరిక మేరకు నూతనంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణపు పనులను ఆదివారం వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పరిశీలించారు. కట్టమంచి నుంచి సాంబయ్యకండ్రిగ వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు గురైంది. ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయన కోటి రూపాయల సొంత నిధులతో నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఆదివారం జరిగిన రోడ్డు పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ కుంభాభిషేకం

గుడిపాల, జనవరి 21: మండలంలోని పానాటూరు పంచాయతీ అనుపు గ్రామంలో ఆదివారం గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రహ్మణ్యం, నిత్యానందం, చందు, శివ, పృథ్వీ, చల్లా తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

చిత్తూరు కల్చరల్, జనవరి 21: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 2024వ వార్షిక క్యాలెండరును సభ్యులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. సమితి అధ్యక్షుడు యస్. మధుసూదనం, నగర కన్వీనర్ శేషనారాయణ, బి. పాండురంగం, ఆర్. సత్యనారాయణ, గజేంద్రరెడ్డి, శ్రీకంఠయ్య, మహిళా సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక 'స్పందన'

చిత్తూరు, జనవరి 21: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్పత్రి భవనాలు కళకళ... సిబ్బంది క్వార్టర్స్ వెలవెల

- నాడు-నేడులో తూగుండ్రం, గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలలో ఇంకా అరకొర పనుల పెండింగ్
- ఏడాది క్రితం అసంపూర్తిగా వదిలి వెళ్లిపోయిన కాంట్రాక్టర్


తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం


ఆరోగ్యకేంద్రం ఆవరణలో శిథిలస్థితికి చేరిన సిబ్బంది క్వార్టర్స్

గంగాధరనెల్లూరు, జనవరి 21: మండలంలోని తూగుండ్రం, గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రధాన ఆస్పత్రి భవనాలు కళకళలాడుతుండగా, అదే ఆవరణలోని సిబ్బంది క్వార్టర్స్ మాత్రం కళావిహీనంగా వెలవెలబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకంలో భాగంగా తూగుండ్రం, గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రధానంగా రోగులను పరీక్షించే ఆస్పత్రి భవనాలకు మాత్రం మోల్డింగ్‌పై భాగంలో, కిటికీలు, వాటి డోర్లు, ఐరన్‌గేట్ల ఏర్పాటు, ఫ్లోరింగ్‌తో పాటు గోడలకు టైల్స్ వేయడం, పెయింటింగ్ పనులు, విద్యుత్ వైరింగ్ పనులు వంటివి అప్పట్లో సంవత్సరకాలంగా కాంట్రాక్టర్ సాగదీసి సుమారు 80శాతం వరకు పనులు పూర్తి చేశారు. ఇంకా ఆస్పత్రి భవనాల్లో ఫ్యాన్లు బిగించడం, కొత్తగా బోర్ డ్రిల్లింగ్‌చేసి, మోటర్ బిగించాల్సి ఉంది. తూగుండ్రం పీహెచ్‌సీ ఆపరేషన్ థియేటర్‌లో గ్లాస్ డోర్లు బిగించకుండా వదిలిపెట్టగా, ల్యాబ్‌టెక్నీషియన్ గదిలో వివిధ టెస్టింగ్ పరికరాలు, మందులు పెట్టడానికి ర్యాక్‌లు అమర్చకుండానే అసంపూర్తిగా పనులు నిలిపేశారు. గంగాధరనెల్లూరులో అయితే ఆస్పత్రి ఆవరణలో పల్లపు ప్రాంతాలను ఎత్తుపెంచి నీటినిల్వలు లేకుండా పనులు 20శాతం మేరకు చేయాల్సి ఉండగా, ఇవి ఎప్పటిలోగా పూర్తిచేస్తారనే విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌ని ఫోన్‌ద్వారా వివరణ కోరడానికి పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది ప్రయత్నం చేయగా, ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెలిసింది. ఆస్పత్రి ఆవరణలో డాక్టర్‌తో పాటు సిబ్బంది క్వార్టర్స్ సైతం శిథిలస్థితికి చేరుకుంటుండగా, వాటి గురించి ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేశారు. నాడు-నేడు కింద ఆస్పత్రిలోని ఒకే ఆవరణలో ఉన్న ఒక భవనాన్ని మాత్రం బాగుచేయించడం, మిగిలిన వాటి గురించి పట్టించుకోకుండా వదిలిపెట్టడంపై ఆస్పత్రికి వచ్చే పలువురు రోగులు సైతం విమర్శిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ఏడాది క్రితం అసంపూర్తిగా వదిలివెళ్లిపోయిన తర్వాత ఆస్పత్రి వైపు తొంగి చూడలేదు. పెండింగ్ పడిపోయిన పనులతో పాటు క్వార్టర్స్ భవనాలను సైతం బాగుచేయించి ఉపయోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం

- పూతలపట్టు ఇన్‌ఛార్జి మురళీమోహన్



యాదమరి, జనవరి 21: పరాయి పాలనలో మగ్గుతున్న బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించిన పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీ మాత్రమేనని పూతలపట్టు నియోజకవర్గ ఇన్ చార్జి కలికిరి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని జోడిచింతల వద్ద టీడీపీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళీమోహన్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలను టీటీడీ చైర్మన్, ఈవోలుగా చేసిందని, వైసీపీ పాలనలో ఒక్క బీసీకైనా అవకాశం దక్కిందా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల దాష్టీకానికి బలైన కుటుంబాలను ఇంత వరకు పరామర్శించిన దాఖలా లేదన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, మొదలియార్ సాధికారిత కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సీఆర్ రాజన్, నేతలు కోదండయాదవ్, షణ్ముగరెడ్డి, ధరణీప్రకాష్, గోపి, మురార్జీ, రవి, జనసేన నాయకులు కుమార్, అన్ని మండలాల బీసీ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం


చెక్కు అందచేస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, జనవరి 21: మండలంలోని బట్టువాళ్లూరుకు చెందిన టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం నాయుడు 20 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడులు ఆర్థికసాయంతో పాటు పిల్లల చదువులకు అయ్యే ఖర్చును కూడా భరిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీపీ తుమ్మల సాంబశివ నాయుడు, మాజీ సర్పంచ్ రవి నాయుడు, నేతలు శివలింగారెడ్డి, యోగానందం, శంకర్, బాల తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పనైపోయింది: థామస్



బహుమతిని అందిస్తున్న థామస్

వెదురుకుప్పం, జనవరి 21: జీడీనెల్లూరు నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి పనైపోయిందని, ఆయన అవసరం లేదని ఆ పార్టీ అధిష్ఠానమే ట్రాన్స్‌ఫర్ చేసిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ విమర్శించారు. ఆదివారం వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చవటగుంట యూత్ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బహుమతుల ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా, టోర్నమెంటులో విన్నర్స్‌గా నిలిచిన పెనుమూరు మండలం గండపొడి ఊరు టీమ్‌కి థామస్ వితరణతో నగదు బహుమతిగా రూ.33333ను అందించారు. అలాగే రన్నర్స్‌గా వెదురుకుప్పం మండలం చవటగుంట బుల్లెట్ యూత్ టీం నిలిచింది.

కరపత్రాల పంపిణీ

వెదురుకుప్పం మండలం దిగువ పల్లాలు పంచాయతీలోని గ్రామాల్లో ఆదివారం 'మన ఇంటికి మన థామస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. థామస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. వివిధ పార్టీల నుంచి పలువుకి టీడీపీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి నేసనూరు మునిచంద్రారెడ్డి, నాయకులు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, పి. మోహన్‌మురళి, కోనేరు చెంగల్రాయరెడ్డి, రజనీకాంత్, రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రచారం


ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 21: టీడీపీ, జనసేన సంయుక్తంగా రా.. కదలిరా కార్యక్రమాన్ని ఆదివారం కేఎం కండ్రిగ పంచాయతీ లక్ష్మీపురంలో ఆ పార్టీ నాయకులు చేపట్టారు. గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల జెండాలను ఎగురవేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభిమానులు సమన్వయంగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. నాయకులు కమల్‌నాథ్ రెడ్డి, కోడి చంద్రయ్య, లోకనాథ నాయుడు, రమేష్, వంశీ, హరిప్రసాద్, రామ్మూర్తి, గజపతి, గిరిబాబు, హేమచంద్ర నాయుడు తదితరులు ఉన్నారు.

'కోడికత్తి కేసులో అసలు ముద్దాయి జగనే'


మాట్లాడుతున్న కార్జాల అరుణ

పెనుమూరు, జనవరి 21: కోడికత్తి కేసులో అసలు ముద్దాయి ముఖ్యమంత్రి జగనే అని చిత్తూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ ఆరోపించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వైజాగ్ విమానాశ్రయంలో తన అభిమాని దళిత బిడ్డ శ్రీను దగ్గర సింపతి కోసం జగనే కోడికత్తితో దాడి చేయించుకుని డ్రామాలు ఆడారని ఆరోపించారు. కోర్టుకెళ్లి సాక్ష్యం చెప్పకుండా ఎందుకు జగన్ తప్పించుకుంటున్నారని, కోర్టుకు వెళితే ముద్దాయి తానేనని బయటపడుతుందని భయపడుతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. దళితులను జైల్లో పెట్టి హింసిస్తూ బయట దళిత ఓట్ల కోసం అంబేడ్కర్ విగ్రహం పెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు రాధమ్మ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటనే శ్రీను విషయంలో స్పందించి వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దళిత మహిళలు రోడ్లపై నిరసనకు దిగుతామని ఆమె హెచ్చరించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రిటైర్డ్ టీచర్లతో గ్రూప్ ఫొటోదిగిన పూర్వ విద్యార్థులు

గంగాధరనెల్లూరు, జనవరి 21: తూగుండ్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం 38 ఏళ్ళ తర్వాత పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం ఉన్నత పాఠశాలలో 19985-86లో 10వతరగతి పూర్తిచేసిన విద్యార్థుల అపూర్వకలయిక అప్పటి విద్యార్థులైన రాజేంద్ర నాయుడు, నటరాజ్ మొదలి, ఏకాంబరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, షబ్బీర్‌అలీ, శ్రీనివాసులు మొదలి, సత్యమూర్తి, బాలకృష్ణారెడ్డి, జగదీష్ నాయుడుల సహకారంతో జరిగింది. ఈ సమావేశానికి అప్పటి గురువులైన దొరైరాజ్, కృష్ణన్, ప్రభాకర్, దేవరాజులు నాయుడు, రామా నాయుడు, మాధవన్, మోహన్‌పిళ్ళై, మనోహర్‌లకు పూర్వవిద్యార్థులు పాదపూజలు చేసి, ఘనంగా సన్మానించారు. పలువురు రిటైర్డ్ టీచర్లు మాట్లాడుతూ 38ఏళ్ళ తర్వాత తమ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దేవరాజులు మందడి, గుణశేఖర్ నాయుడు, హేమ, రిటైర్డ్ టీచర్లు కమ్మరల్లీ, ఆర్ముగంపిళ్లై పాల్గొన్నారు.

మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు

చిత్తూరు సిటీ, జనవరి 21: ఓంశక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లి రావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 ఉచిత బస్సులను ఏర్పాటుచేశారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరు, పచ్చనపల్లి, గువ్వకల్లు, నగరంలోని పెద్దహరిజనవాడ, తోటపాళ్యం, లక్ష్మీనగర్ కాలనీ, గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లి, కిలారిపల్లిలో ఓంశక్తి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. ఓంశక్తి భక్తులకు అన్నదానం, ఉచితంగా చీరలు పంపిణీ చేసి, మేల్‌మరువత్తూర్ యాత్రకు బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుడి మహా కుంభాభిషేకం


టీడీపీ నేతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

గుడిపాల, జనవరి 21: మండల కేంద్రమైన గుడిపాలలో నూతనంగా నిర్మించిన వినాయకుడి ఆలయ మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం పురోహితులచే హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కార్మేఘన్, ప్రసాద్‌రెడ్డి, డేవిడ్, సాయి, నేతలు గోళ్ల హరిప్రసాద్ చౌదరి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, నేతలు చెన్నకేశవులు నాయుడు, సాంబశివ నాయుడు, గోపి, ఆనంద యాదవ్, సుధాకర్ యాదవ్, నాగరాజ యాదవ్, రాజేంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం, అక్షింతల పంపిణీ

చిత్తూరు కల్చరల్, జనవరి 21: అయోధ్య రామమందిరం సోమవారం ప్రారంభం కానున్నందున నగరంలో వివిధ ప్రాంతాల్లో రామభక్తులు అన్నదానాలు, అక్షింతల పంపిణీ చేయనున్నారు. గిరింపేట దుర్గాంబ ఆలయ భక్త బృందం నిర్వాహకులు వీకే విశ్వనాధ్, బజారు వీధి జ్యువెలరీస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు. కట్టమంచి షిర్డీ విశ్వసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయం నుంచి కట్టమంచి, చర్చివీధి, మార్కెట్, బజారువీధుల్లో శ్రీరామ చిత్ర పటం ఊరేగించనున్నారు. స్థానిక కోదరండరామాలయంలో అయోధ్య రామమందిరంలో బాల శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా తిరుమంజనం, అభిషేకం, శ్రీరామ పట్టాభిషేకం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్‌సేవ నిర్వహించనున్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, సాధు సంఘ్, సత్యసాయి సేవాసమితి, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాలకు చెందిన వారు భారీ ఎత్తున ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

వైభవంగా ఖాదర్‌వలీ ఉరుసు మహోత్సవం

చిత్తూరు కల్చరల్, జనవరి 21: గిరింపేట చౌడేశ్వరమ్మ జంక్షన్‌లో వెలసిన ఖాదర్‌వలీ దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం అత్యంత భక్తి ప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో మతాలకు అతీతంగా బాబా సమాధికి గంధం నిర్వహించిచ మేళతాళాలతో పుర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సుభాన్ ఫకీర్ బాబా బృందం తమ ఖవ్వాలి సాంస్కృతిక ప్రదర్శనతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఖవ్వాలి పాడుతున్న ఫకీరుబాబాలు